ప్రియదత్త - 30-07-2003

# మరణ భిక్ష

ఆ మర్నాడు మా మూడో అల్లుడు పెళ్ళయిన తర్వాత మొదటిసారిగా వస్తున్నాడని మా ఆవిడ చేసిన హంగామా అంతా ఇంతా కాదు. అతగాడికి కందిపప్పు పచ్చడీ, ఉల్లిపాయల తియ్యపులుసూ చాలాచాలా ఇష్టమని మా మూడో కూతురు వసంత ముందుగానే - ఉత్తరం వ్రాయడంవల్ల, వాటికి కావాల్సిన మేలురకం సరుకులు తీసుకురమ్మని ఉత్తరం అందిన రోజు నుంచీ శ్రీమతి పెడుతున్న నస భరించలేక, ఆ రోజు - ఉదయమే కొందరు ప్రైవేటు కుర్రాళ్లందించిన జీతం డబ్బుల్ని జేబులో వేసుకొని బజారుకి బయలు దేరాను.

దినుసుల ధరలు ఆకాశాన్నంటుతుంటే, ఉల్లిపాయల ధర అంతరిక్షంలోకి దూసుకుపోయింది. మహారాష్ట్రలో మళ్లీ మూడో సంవత్సరం ఉల్లిపంట నాశనమైనందుకూ, మా మూడో అల్లుడికి ఉల్లిపాయల పులుసంటే ఇష్టమున్నందుకూ కాస్త సణుక్కుంటూ, కాఫీ పొడుం ధరలు రాత్రికి రాత్రే ఆరింతలు పెరిగినా నోరు మెదపని దక్షిణాది రాజకీయ నాయకుల్ని తిట్టుకుంటూ, పావుకేజీలు, అరకేజీలు కొనడమే మహద్భాగ్యమనుకొంటూ, సంచీలో సరుకులు సగం కూడా నిండక మునుపే ఉన్న డబ్బంతా ఊడ్చిపెట్టి, ఉసూరుమనుకొంటూ కాలినడకన ఇల్లు చేరేసరికి సూర్యుడు నడినెత్తిమీది కొచ్చాడు.

సంచీ బరువు చూసి, సంచీలోని సరుకుల్ని చూసి శ్రీమతి పెదవి విరిచి, ఆవేం చాల్తాయన్నట్టుగా ఆదోలా ముఖంపెట్టి చూపుల్లోనే ప్రశ్నించింది. సమాధానమైతే నా దగ్గర ఉంది కాని, అది ఆవిడగారికి రుచించదు.

మా పెద్దాడు ఓ మంచి పెద్ద కంపెనీలో చెప్పుకోదగ్గ ఉద్యోగమే చేస్తున్నాడు. కావడానికి మంచివాడే అయినా, కాస్త ఇంటి పరిస్థితుల్నీ, రోజురోజుకీ దిగజారిపోతున్న డబ్బు విలువనీ సమన్వయం చేసి చూసుకోవాలన్న ధ్యాస ఉండదు. జీతాలు రాగానే నాలుగయిదు తారీఖుల్లో వాళ్లమ్మచేతికి ఇంటి ఖర్చులకని కొంత సొమ్ము ఇస్తాడు. నాలుగేళ్లనుండీ నయాపైసా ఎక్కువ తక్కువ కాకుండా అంతే ఇస్తున్నాడు. వాడిచ్చే సొమ్ముకి ముప్ఫై అయిదేళ్ళ సర్వీసు తర్వాత నాకు వస్తున్న పింఛను సొమ్మంతా పైసా దాచకుండా కలిపి ఖర్చు పెడ్తుంది. పూర్తిగా వాడి మీద ఆధారపడి బ్రతకట్లేదనీ, అవసరమొస్తే మా బ్రతుకులు మేము బ్రతకగలమనీ మా కోడలికి తెలియాలన్న నిత్యప్రయత్నంతో ఉంటుంది నా ఇల్లాలు! అందుకని వాడెంత యిస్తే అంత తీసుకోవడం తప్ప, తనోపైస ఎక్కువడగదు, నన్నడగనియ్యదు!

జీతాలు పెరిగినా వాడిచ్చేది పెరగదు. సంవత్సరాలు గడిచినా మునిసిపాలిటీ నాకిచ్చే పించను పెరగదు. అయితే పెరుగుతున్న ధరల్ని గురించి చర్చించినప్పుడల్లా మరిన్ని ప్రైవేట్లు చెప్పమంటుంది! సంస్కృతాంధ్రభాషల్లో ప్రావీణ్యం సంపాదించిన నేను మునిసిపల్ హైస్కూల్లో తెలుగు పంతులుగా పనిచేసి పదవీవిరమణ చేశాను. అయితే భాష భోజనం పెట్టదు. ఏదో అయిదోక్లాసు వరకూ ఆషామాషీగా తెలుగూ, ఇంగ్లీషూ, లెక్కలూ చెప్పించుకొనే మునిసిపల్ ఎలిమెంటరీ స్కూళ్ల ఏ కొద్దిమంది విద్యార్థులో తప్ప ప్రైవేటు పాఠాలకెవరొస్తారు కనక? కోచింగ్ సెంటర్లొచ్చి స్కూళ్లలోనే హాజరు తగ్గిపోయిన రోజుల్లో, తెలుగు పండితుల దగ్గరికి పాఠాలు చెప్పించుకోడానికి వస్తారనుకోవడం భ్రమ తప్ప మరేమీ కాదు! ఇవన్నీ చెప్పినా శ్రీమతి అర్థంచేసుకోదు. చేసుకోలేక కాదు, చేసుకోడానికి ఇష్టంలేక!

"రేపూ, ఎల్లుండీ ఎలాగో గడుపు. ఎల్లుండి సాయంత్రం మరికొంతమంది కుర్రాళ్ళు జీతాలిస్తారు," అన్నాను కాస్త గొంతు తగ్గించి. నిజానికి చెల్లెలూ, బావగారూ వస్తున్నారని తెలిసిన మా పెద్దాడు కాస్త ముందుకు రావడం ధర్మం. ఆ ఆలోచన నా మనసులోనే ఉండిపోయింది కాని, మాటల రూపంలో బయటకు రాలేదు. వచ్చినా శ్రీమతికి చికాకు తెప్పించడం తప్ప మరేమీ ప్రయోజనముండదు.

అంతలోనే లక్ష్మీపతిగారి మనిషి ఒకతను వచ్చి 'అయ్యగారు మిమల్ని వీలుచూసుకొని ఈ మధ్యాహ్నం ఓసారి వచ్చి కలుసుకోమని చెప్పార'ని చెప్పి వెళ్లడంతో ఇంటి అరుగు క్రింది మెట్ల మీద వదిలిన చెప్పుల వైపు వెళ్లబోతూంటే, "లేడికి లేచిందే పరుగన్నట్లుంది మీవ్యవహారం! ఆయన వీలుచూసుకొని రమ్మన్నారు కాని, వెంటనే కాదు! ఎండబడి వెళ్ళొచ్చారు. భోజనం చేసి, కాస్త విశ్రాంతి తీసుకొని మరీ వెళ్లండి. లేకపోతే లోకువైపోతారు!" అన్న శ్రీమతి గదమాయింపు విని, దారి మళ్ళించి మండువాలో కాళ్ళు కడుక్కొని, వంటింటి వసారా వైపు అడుగులు వేశాను. అన్నం తిన్న తర్వాత ఓ అరగంట కునుకు తీసి వెళ్దామనుకున్న వాణ్ణి మెలకువ రాకపోవడంతో మూడింటిక్కాని లక్ష్మీపతిగారి భవనానికి వెళ్లలేకపోయాను.

వాళ్ల కుటుంబానికీ మా కుటుంబానికీ మూడు తరాల స్నేహం. సాహసంతో కష్టనష్టాలకు తెగించి, వ్యాపారంలో పైకి వచ్చిన కుటుంబం వాళ్ళది. ఏదో వంటబట్టిన చదువుల్ని ఆసరా చేసుకుని ఏవో ఉద్యోగాలు వెలగబట్టే కుటుంబం మాది. సాహసం చెయ్యలేనివాళ్ళు ఎక్కడికక్కడే ఉండిపోతారన్నది, మా రెండు కుటుంబాల్ని పోల్చిచూస్తే తెలుస్తుంది. అయితే ఉన్న సంగతనండి, అదృష్టమనండి వాళ్ళంటే మాకు అసూయ లేదు. మా మీద వాళ్లకి అప్యాయతకు కొదవ లేదు. ఇంతకీ చెప్పడం మరిచిన సంగతేమిటంటే, ఆయన శ్రీ ఇంజనీరింగ్ వర్క్సుకి అధినేత, అధ్యక్షుడు. ఆయన పెద్ద కుమారుడు రఘుపతి మేనేజింగ్ డైరెక్టరు. మా పెద్దవాడు పన్జేస్తున్నది వాళ్ళ కంపెనీలోనే.

నే వెళ్ళేసరికి లక్ష్మీపతిగారు మేడ మీద తమ ఎయిర్ కండిషన్డ్ హాల్లో సోఫాలో కూర్చుని, ఏదో మధురమైన వాద్యసంగీతాన్ని వింటున్నారు. నన్ను చూస్తూనే రిమోట్ కంట్రోల్‌తో సి.డి. ప్లేయర్ని ఆపుచేసి, 'రండి, రండం'టూ ఆహ్వానించి పక్కనున్న సోఫాలో కూర్చుండబెట్టాడు.

"మీరు హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన సంగతి నాకు తెలియదు. తెలిస్తే మీ కబురుతో నిమిత్తం లేకుండా నేనే వచ్చి కలుసుకొనేవాణ్ణి" అన్నాను కూర్చున్న తర్వాత.

"నిజానికి నేను తిరిగివచ్చి వారం రోజులకి పైగా అయింది. నేను తిరిగివచ్చిన సంగతి ఎవరికీ చెప్పకూడదని అనుకొన్నా ఉండబట్టలేక మీకు కబురంపాను," అంటూ ముందు బల్ల మీదనున్న ఫ్లాస్క్‌లోంచి చల్లటి నీరుని ఓ గ్లాసులో నింపి నా కందించాడు. నీళ్ళు త్రాగి, గ్లాసుని బల్ల మీద పెడ్తూ ఆయనకేసి పరీక్షగా చూశాను. మనిషిలో ఏదో దిగులు కనిపిస్తోంది.

వ్యాపారంలో దెబ్బేమైనా తగిలిందేమో అనుకొన్నాను. ఆయన దిగులు గురించి కారణం నేనడగలేదు. ఆరాలు తీస్తే చెప్పే మనస్తత్వం కాదాయనది. చెప్పాలనుకొంటే తనే చెప్తాడు.

"మీ హైదరాబాద్ ప్రయాణం ఎలా జరిగింది? అక్కడ కూడా ఎండలు బాగా కాస్తున్నాయను కొంటాను," అన్నాను కాకరకాయ కబుర్లలోకి దిగుతూ.

"హైదరాబాద్ కబుర్లకేముంది, అంతా మామూలే! ఏదో మీతో కాలక్షేపం చేద్దామని కబురంపాను. కొత్త సంగతుల్ని గురించి కొన్ని సందేహాలను తీర్చుకోవాలని ఉంది," అన్నాడాయన కాస్త గంభీరంగా.

"పాతకాలపు చదువులు చదివిన సామాన్యుణ్ణి, హైటెక్ యుగం గురించీ, కొత్త సంగతుల్ని గురించీ మీ సందేహాల్ని తీర్చగలనని నేననుకోను," అన్నాను చిన్నగా నవ్వుతూ.

"అందరికీ తెలిసిన సంగతే అయినా, అందరూ దూరంగా ఉంచే విషయం కొత్త సంగతి కిందే లెక్క! ఇంతకీ మరణాన్ని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా?"

ఆయన దగ్గర్నుంచి అటువంటి ప్రశ్న వస్తుందని ఎలా ఊహించగలను?

"సమాధానం ముందుగా మీరే చెప్పి, ఆ తర్వాత ప్రశ్నిస్తే నేనేం చెప్పగలను?" కాస్త తడబడ్తూ అన్నాను.

"జీవన్మరణాలని గురించి కాస్త విశ్లేషిస్తారనుకొన్నాగాని, ఇలా కప్పదాటు సమాధానం చెప్తారనుకోలేదు!" కావాలని కొంచెం నిష్ఠూరంగా అన్నాడాయన.

"ఆది నుంచీ అందరూ చూస్తున్న విషయమే అయినా అర్థంగానిది మరణం. అర్థం చేసుకోలేని విషయం జీవితం. యోగి వేమన ఈ విషయమై ఏమన్నాడంటే,

"తాముగన్నవారు తముగన్నవారును
జచ్చుటెల్ల తమకు సాక్షి కాదె
బ్రతుకటెల్ల తమకు బ్రహ్మకల్పంబులా
విశ్వదాభిరామ వినురవేమ!

"కాలయముడి పాశం నుంచి ఎవరూ తప్పించుకోలేరు. వేమన ఈ విషయమూ చెప్పాడు.

"చచ్చెజచ్చెననుచు జావుకువగచెదు
దీన నరుల వెఱ్ఱి దెలుపరాదు.
ప్రాణమునకు మృత్యుబంధంబులుడుగునా
విశ్వదాభిరామ వినురవేమ!

"జీవనగానానికి అంతిమ చరణం మరణం. జీవితానికి గమ్యం మరణం. అలాగని ఎప్పుడు మృత్యువు వాత పడ్తామోనని జీవితాన్ని నిరంతరచింతతో గడపడం విజ్ఞుల లక్షణం కాదు?" ఆయన దిగులుకి ఒకవేళ మరణ భయం కారణమేమోనని తోచి కొద్దిగా మందలించడానికి ప్రయత్నించాను, ఆయన ఆ ప్రస్తావనకి స్వస్తిచెప్తాడన్న ఆశకొద్దీ.

అయితే లక్ష్మీపతిగారూరుకోలేదు. మళ్ళీ ప్రశ్నించాడు.

"మరణం తప్పదని తెలిసి కూడా మనిషెందుకు భయపడ్తాడు?".

"వేదాంతుల్ని వెయ్యవలసిన ప్రశ్నలు వేసి నన్నిబ్బంది పెడ్తున్నారు! అయినా నాకు సాధ్యమైనంత వరకూ చెప్పడానికి ప్రయత్నిస్తాను. పెద్దలు పెట్టిన పేరుతో సంబంధం లేకుండా ప్రతిమనిషిలోనూ 'నేను' అన్న భావన ఉంటుంది. ఇది ఒక్క మనిషికే పరిమితం కాదనుకోను, ప్రతి జీవికి వర్తిస్తుంది. ఆ 'నేను' అన్న భావనకి రూపరహితమైన మరో నిర్వచనం ఆత్మ లేదా జీవుడు.

"జీవుడికి ఆధారం శరీరం. మరణంతో శరీరం నశిస్తుంది. మృత్యురేఖకి ఇవతలి వైపు గడిపిన జీవితం తర్వాత, ఆ రేఖ దాటి అవతలి వైపుకు వెళ్లిన తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. శరీరంతో బాటు 'నేను' అన్న భావన కూడా నశిస్తుందా? లేదా మరో ఆధారం కోసం తపిస్తుందా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియకనే మనిషిలోని నేను నిరంతరమూ భయపడ్తుంది. ప్రతిజీవి మృత్యువంటే గజజలాడుతుంది. పాముని చూసి మనిషి కర్రని చేబడ్తాడు, కర్రెత్తిన మనిషిని చూసి పాము పరుగెడ్తుంది. వేటగాడి బారి నుండి జంతువులు తప్పించుకోడానికి ప్రయత్నించినా, రోగాల బారి నుండి మనిషి బయటపడడానికి ప్రయాసపడినా చావంటే భయంవల్లనే!

"ప్రాణమాత్మయన్న ప్రాణి జీవమటన్న
జీవి ప్రాణమాత్మజేరి యొకటి
కర్మబంధమునసుగట్టబడినదెగాని
దేహబంధికెపుడు తెలుపు వేమ,"

వేమనగారి మరో పద్యం చెప్పి ఆయన మాటలకి ఆనకట్ట కడ్దామన్న నా ప్రయత్నాన్ని ఆయన కొనసాగనివ్వలేదు.

"జీవానికి ఆధారమైన శరీరం ఎప్పుడైతే నశిస్తుందో దాన్ని మరణమంటున్నారు. గర్భధారణ ఎలా జరిగేదీ నేటి వైద్యశాస్త్రం స్పష్టంగా చెప్తోంది కాని, ప్రాణమనే దానికి సరైన నిర్వచనం చెప్పలేకపోతోంది. నేను అన్న భావన కానీండి, 'ఆత్మ' అనే పదార్థం కానీండి గర్భస్థపిండంలో ఎప్పుడు, ఎలా ప్రవేశిస్తుంది?" – ఆయన కఠినమైన ప్రశ్నే వేశాడు.

"ఈ ప్రశ్నకి సమాధానం చెప్పడం నా తరంగాదు. కాని ఓ విషయం మనం ఆలోచించక తప్పదు. తల్లి గర్భమనే చెరసాలలో ఆ 'నేను' అనేది ఏం పాట్లు పడ్తుందో మనకు తెలియదు. అలాగే మరణం తర్వాత ఆ 'నేను'కి ఏమవుతుందో తెలియదు. జనన మరణాలకి మధ్యనున్న జీవితమే అవగాహన కానప్పుడు పుట్టడానికి ముందూ, గిట్టడానికి తర్వాతా ఏం జరుగుతుందీ

అన్నది అంతుపట్టడానికి సాధ్యం కానిది. బహుశా ప్రాణికోటికి ఈ అజ్ఞానం ప్రకృతి ఇచ్చిన వరం కావచ్చు. అంతర్ముఖులైన యోగులకీ, మునులకీ ఈ రహస్యం తెలుసునేమో నాకు తెలియదుకాని, వారందరూ మానవాళిని ఊరడించి శాంతింపజేయడానికి కాస్త కర్మ సిద్ధాంతాన్ని ప్రవచిస్తూ ఉంటారనేది నా అభిప్రాయం," అన్నాను కాస్త మధ్యేమార్గంగా. జవాబు తెలియనప్పుడు మనమందరమూ చేసే పనే ఇది.

"కర్మభూమిలో పుట్టామని గొప్పలు చెప్పుకొంటూ, కర్మ సిద్ధాంతాన్ని గుడ్డిగా నమ్మి కాళ్లు చాపి కూర్చోడం వల్లనే, మన దేశమే మీరంటున్న మరణావస్థకి చాలా త్వరితంగా చేరుకోవడంలో ప్రజలు దోహదం చేస్తున్నారు. ఇది ఆత్మహత్యాసదృశం. సరే, మరణం జీవితానికి గమ్యమైనప్పుడు ఆత్మహత్య పాపం కాదంటాడు పర్షియన్ వేదాంతి ఖలీల్ జిబ్రాన్! దీనికి మీరేమంటారు?" లక్ష్మీపతిగారీ ప్రశ్న నడగడంతో, ఏదో తెలియని సందేహం నా హృదయంలో చోటు చేసుకోసాగింది.

"అదృష్టానికి అవినీతిపరమైన దగ్గర దారులు వెదుక్కోవడం ఎంతటి నేరమో, జీవితాన్ని అర్థాంతరంగా అంతమొందించుకోవడం సంఘపరంగా అంతే నేరం. చట్టరీత్యా హత్యా ఆత్మహత్యా రెండూ నేరమే," అన్నాను.

లక్ష్మీపతిగారికి నన్ను మాటల్లో ఓడించాలనిపించింది కాబోలు, వెంటనే మరో ప్రశ్న సంధించాడు.

"జీవితమంటే రోత పుట్టి సన్యసించిన వాణ్ణి శిక్షించని సమాజం ఆత్మహత్యని ఎందుకు నేరంగా పరిగణిస్తుంది?"

"సంఘం నియమించిన జీవన సూత్రాలకీ, వ్యక్తిగతంగా నమ్మిన సిద్ధాంతాలకీ ఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఈ రెండింటిలో అసంబద్ధతలు గోచరిస్తూనే ఉంటాయి. వాటిని గురించి వితండవాదనలు చేస్తే వివరణలివ్వడం సులువు కాదు" అన్నాను నేను. ఇంతకు మించిన సమాధానం ఇవ్వలేకపోయాను. ఆయన ప్రశ్నలో వాస్తవముంది.

"ఆకార రహితమైన జీవం - బ్రహ్మపదార్థమైన జీవం - అన్నిటిలోనూ, అందరిలోనూ ఉన్నప్పుడు, ఒక జీవి మరొక జీవిని హతమార్చడం నేరం అనుకొంటే, మనిషి మనిషినేగాక మరే జీవిని చంపినా నేరంగానే పరిగణించాలి. శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదన్న, కర్మసిద్ధాంతపరమైన నమ్మకాన్ని గణనలోకి తీసుకొంటే హత్యా, ఆత్మహత్యా రెండూ నేరాలు కావు! ఏమంటారు?"

"ఏమంటాను? ఏమనగలను? మీరు పిడివాదం చేస్తున్నారంటాను! ఆత్మరక్షణ కోసం చేసే ప్రత్యక్ష ఘర్షణలో చంపడమనేది జరిగితే సంఘం అమోదిస్తుంది కాని, మరోవిధంగా కాదు."

"అదే ఆలోచనా ధోరణిలో దేహ బాధల నుండి ఆత్మని రక్షించుకోవడం కోసం ఆత్మహత్య చేసుకోవాలనుకొంటే సంఘం ఎందుకామోదించదు?"

అయన ప్రశ్నలడుగుతున్న తీరు చూస్తుంటే నాలోని సందేహం బలపడసాగింది. నా ముఖకవళికల్లో మార్పు కనిపించిందనుకొంటాను, చిన్నగా నవ్వుతూ అన్నాడాయిన.

"నా మాటల్ని విని మీరూహించేది నిజమే!"

ఒక్కసారిగా అదిరిపడ్డాను. అయోమయంగా చూస్తూ ఉండిపోయాను.

"కొండ శిఖరాల్నుంచి లోయల్లోకి దుముకుదామనీ, సముద్రంలో కలిసిపోదామనీ, కరెంటు తీగల్ని పట్టుకొందామనీ, కిర్సనాయిలుతో స్నానం చేసి అంటించుకొందామనీ, చెట్టు కొమ్మకు ఉరేసుకొందామనీ, రైలు కింద తల పెడ్దామనీ, నిద్ర మాత్రల్ని దండిగా మింగుదామనీ, విషం తాగుదామనీ, ఆఖరిగా రివాల్వర్‌తో కాల్చుకొందామనీ ప్రయత్నించి, నా చేతుల్లో నా ప్రాణాలు తీసుకునే సాహసం చెయ్యలేక చివరి క్షణంలో ప్రతిసారీ విరమించుకోవలసి వచ్చింది! ఈ జీవితాన్నుంచి విముక్తి పొందడం కోసం నేను చేసిన ప్రతి ప్రయత్నమూ, మీరన్నట్టుగా మరణం తర్వాత ఏమిటన్న భయమే మనసుకు బంధం కావడంతో విఫలమైంది. ఆత్మహత్య చేసుకోడానిక్కూడా చాలా ధైర్యముండాలన్న విషయం తెలిసొచ్చింది!"

లక్ష్మీపతిగారు ఓ రకమైన నిర్లిప్తతో అన్న మాటలు నన్ను నోట మాట రాకుండా చేశాయి.

కాస్త ప్రయత్నంచేసి కోపంగా అన్నాను – "మీకీ పాడు ఆలోచన ఎందుకు వచ్చిందో నా కర్థం కావటల్లేదు. చివరికైనా సత్యం గ్రహించారు సంతోషం. భగవంతుడు మీకాపాటి పిరికితనం ఇవ్వడం నిజంగా మంచిదే అయింది. నిక్షేపంగా సాగుతున్న జీవితాన్ని అంతం చేసుకోడానికి మీరు ప్రత్నించారంటే, నాకు తెలియని బలీయమైన కారణం ఏదో ఉండితీరాలి!"

"శరీరంలోని రుగ్మతని భరించలేక! జీవచ్ఛవంలా బ్రతకడం ఇష్టంలేక! నా ప్రయత్నాలు విఫలమయ్యాయి కాబట్టి ముక్తికి మార్గాంతరం ఆలోచించాను."

"అలాగన్నారు బావుంది. దైవధ్యానం చెయ్యండి. ప్రాపంచిక విషయాల మీద నుంచి దృష్టి మళ్లించి అధ్యాత్మిక చింతన చెయ్యండి."

"అవి చేస్తే నా మనసుకు శాంతి కలుగుతుందేమోకాని, శరీరానికి బాధ మట్టుకు తప్పదు. నేనాలోచించింది మీరు చెప్పిన మార్గం కాదు."

"మరి...?" అర్థోక్తిగా ఆగిపోయాను.

"మీరు నన్ను చంపి నాకు మరణభిక్ష పెట్టండి!"

లక్ష్మీపతిగారన్న మాటలు 'నన్ను' విభ్రాంతిలో ముంచాయి.

"క్షమించండి, మీరు నాతో వేళాకోళ మాడుతున్నారు! లేదా, మీరేం మాట్లాడుతున్నారో మీకే తెలియటల్లేదు!" ఉద్రేకపడ్తూ అన్నాను.

"వేళాకోళంకాదు, సీరియస్‌గానే అంటున్నాను! జాగ్రత్తగా వినండి. మీ ముగ్గురు కూతుళ్లకీ నేను చేసిన సహాయం వల్లనే వివాహాలు జరిగాయి. మీ పెద్దాడికి మా కంపెనీలో అతడి చదువుకీ, అర్హతకీ మించిన ఉద్యోగం ఇచ్చింది నేనే. మీ రెండోవాడి మెడిసిన్ చదువుకీ, మూడోవాడి ఇంజనీరింగ్ చదువుకీ స్కాలర్‌షిప్‌లిచ్చి, హాస్టలు ఖర్చులు భరిస్తున్నది నా కంపెనీయే. నావల్ల ఇన్ని సహాయాలు పొందినందుకు ప్రతిఫలంగా మీరు నాకు మృత్యువుని ప్రసాదించాలి! లేకపోతే..." లక్ష్మీపతిగారి గొంతులోని కరకుదనం గుర్తించగలిగాను.

ఇదెక్కడి విడ్డూరం?! ప్రతిఫలంగా ప్రాణాల్ని కోరితే సమంజసంగా ఉంటుందికాని. ప్రాణాల్ని

తియ్యమనడం నాకు కొరుకుడు పడలేదు. ఇటువంటి క్లిష్టమైన పరిస్థితిలో ఇరుక్కుపోడానికి నామట్టుకు నేనెంతవరకూ బాధ్యుణ్ణి అన్న ఆలోచనలు ఒక్కసారిగా చుట్టుముట్టాయి. వేమన పద్యం మనసులో మెదలాడింది.

జనన మరణములకును సరిస్వతంత్రుడు కాడు.
మొదట కర్తగాడు తుదనుగాడు,
నడుమకర్తననుట నగుబాటుకాదొకో
విశ్వదాభిరామ వినురవేమ.

పుట్టడం మన చేతుల్లో లేదు, నిజమే! కాని ఆధునిక వైద్యశాస్త్రం పుట్టించడం మన ఆధీనంలోనే ఉందని ఎలుగెత్తి ఘోషిస్తున్నా, ఎందుకు అరడజను మంది సంతానానికి కారకుడనయ్యాను? మరణం మన చేతుల్లో లేదు, అదీ నిజమే కొంతవరకూ, కానీ నాకూ, నా కుటుంబానికీ సహాయం చేసిన పెద్దమనిషి తనంతగా తాను ప్రాణాలు తీసుకోలేక, ఆయన మరణానికి నన్ను కర్తను కమ్మంటున్నాడు! పరుల సహాయం మీద ఆధారపడి నిరంతర బానిసత్వానికీ, కృతఘ్నతకీ దారితీసే ఈ జీవనమార్గాన్ని ఎన్నుకున్నందుకు ఎవర్నీ దూషించి ప్రయోజనం లేదు. నన్ను నేనే నిందించుకోవాలి!

'మీరేదో ఆలోచనలో పడిపోయారు...."

లక్ష్మీపతిగారి మాటలు విని మళ్లీ ఈ లోకంలో పడ్డాను. నన్ను చూస్తూ ఆయన ఒక్కొక్క మాటా తూచి తూచి అనసాగారు.

"మన ముందున్న ఆ బల్ల మీద చూడండి. మీరు ఆలోచనలలో మునిగి మునకలు వేస్తున్న సమయంలో, కింద అరలో పేపరు కింద దాచిన వాటిని బల్ల మీద పెట్టాను. ఆ పల్చటి కవర్లో నా చావుకి ఎవరూ బాధ్యులు కారని ఉత్తరం రాసి ఉంచాను. ఆ మందపాటి కవర్లో అయిదు వందల రూపాయల నోట్లు నాలుగు వందలు ఉన్నాయి. అంటే రెండు లక్షలు! నిన్నా మొన్నా బ్యాంక్‌లోంచి తీసిన సొమ్ము కాదది. అప్పుడప్పుడూ అదా చేసిన సొమ్ము. అందుచేత ఆచూకీకి అందదు. నా భార్యా, కోడలూ, మనవలూ, నౌకర్లూ, వంటచేసేవాడూ – అందరూ కాండ్రకోట అమ్మవారి తిరణాలకి వెళ్ళారు. నా కొడుకు ఆఫీసులో ఉన్నాడు. అందరూ ప్రొద్దుపోతేకాని తిరిగిరారు. నేను గట్టిగా కళ్ళు మూసుకొని కూర్చుంటాను. ఆ తర్వాత కాస్త ధైర్యంతో మీరు చెయ్యవలసిందల్లా అర నిముషంలో జరిగిపోతుంది. మీరు ఆ గ్లవ్స్ తొడుక్కొని, సైలెన్సర్ అమర్చిన ఆ రివాల్వర్ తీసుకొని నా గుండెకి దగ్గరగా పెట్టి ట్రిగ్గర్ నొక్కండి. నాది కుడిచేతి వాటం కాబట్టి ఆ రివాల్వర్‌ని నా కుడిచేతిలో ఉంచి, ఆ డబ్బున్న కవర్ని తీసుకుని వెళ్లిపొండి. వెడ్తూ వెడ్తూ ఆ గ్లవ్స్‌ని కిందనున్న కిచెన్ షెల్ఫ్‌లో పడేసి పొండి. మా వంటవాడు గ్లవ్స్ తొడుక్కుని వంట చేస్తాడు. ఆ షెల్ఫ్‌లో చాలా గ్లవ్స్ ఉంటాయి. అందరూ ఆత్మహత్యే అనుకొంటారు కాని జరిగింది ఎవరికీ తెలియదు!"

రెండు లక్షలన్న మాట విని ఒక లిప్తకాలం నా ఆలోచనలు రెపరెపలాడాయి. మా మూడో కూతురు తన భర్తకి కందిపచ్చడీ, ఉల్లిపాయల తియ్యపులుసూ ఇష్టమని వాళ్ళమ్మకి వ్రాసిన

ఉత్తరంతోపాటు నాకూ ఓ ఉత్తరం వ్రాసింది. అతగాడు స్కూటర్ కోసం నసపెడ్తున్నాడని! ఆ ఉత్తరాన్ని గురించి ఎవరికీ చెప్పలేదు. చెప్పినా ప్రయోజనం లేదు. చెప్పడానికి అస్కారం లేదు. ఏవో నా తంటాలు నేను పడాలి. ఆయన్ని చంపేస్తే రెండు లక్షలు లభిస్తాయి! ఆయన చూపించిన ఆశతో, నా సమస్యలకు పరిష్కారం వెదుక్కుంటున్న నా మీద నాకే అసహ్యం వేసింది.

అంతవరకూ నన్నావహించిన స్తబ్దతని ఒక్కసారిగా విదిలించుకొని, విసురుగా అన్నాను. "కొద్ది క్షణాల క్రితం 'లేకపోతే' అని అర్ధోక్తిగా ఆగిపోయి నన్ను బెదిరించారు. ఇప్పుడు సొమ్ము చూపి ఆశపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఆత్మాభిమానాన్ని చంపుకుని పలుమారులు మీ సహాయాన్నందుకొని, ఇప్పటికే చాలా మెట్లు దిగజారిపోయాను. ఈ ఘాతుక చర్య నాచేత చేయించాలన్న ఆలోచన మీకెందుకొచ్చిందో నా కంతుపట్టటం లేదు! మీరు చెప్పినపని చెయ్యనంటున్నందుకు మీరెంతటి శిక్ష విధించినా భరిస్తాను!"

"మీకింతగా కోపం రావడం మొదటిసారిగా చూస్తున్నాను. నా చేతుల్లో నా ప్రాణాలు తీసుకొనే ధైర్యంలేక మెర్సీకిల్లింగ్ చెయ్యమని మిమ్మల్ని అర్థించానంతే! అంతకంటె నేరం చెయ్యలేదుగా?!" – లేని నవ్వు తెచ్చుకొని అతనన్న మాటల్లో లీలగా బెదిరింపు గోచరించింది.

చదువులు పూర్తికాని కొడుకులూ, ఆశలు తీరని అలుళ్ళూ మళ్ళీ ఆలోచనల్లో చోటుచేసుకొనబోతూండగా, గట్టిగా బుర్ర విదిలించుకొని ఆలోచనల్ని పక్కకు నెట్టి, కాస్త వ్యంగ్యం జోడించి అన్నాను.

"మీ కొచ్చిన రోగమేమిటో నాకు తెలియదుకాని, ఆ ఇచ్చే రెండు లక్షలూ ఏ డాక్టరుకో ఇస్తే మీ రోగం నయమయే అవకాశమూ ఉంటుంది. లేదా ఏ ఆపరేషన్ బల్ల మీదో ఆశయం నెరవేరే అవకాశమూ ఉంటుంది! అంతేకాని, ఇలా స్నేహితుణ్ణి పట్టుకొని ప్రాణాలు తియ్యమని చంపుకు తినడం భావ్యం కాదు!"

"అన్ని సదుపాయాలూ ఉన్న ఆస్పత్రులకూ కొదువ లేదు, బల్లెక్కి ఆపరేషన్ చేయించుకోడానికి నాకు డబ్బుకూ కొదవలేదు. కాని వచ్చిన చిక్కేమిటంటే... ఆ ఆపరేషన్‌కి కావల్సిన ఒక వస్తువుని నేనే సమకూర్చుకోవాలి."

"అంటే...?" అయోమయంగా ప్రశ్నించాను.

"నా మూత్రపిండాలు చెడిపోయాయి" – ఆయన చిన్న స్వరంతో సమాధానమిచ్చాడు.

కాస్త ఊపిరి పీల్చుకోగలిగాను. మనసు కొంచెం కుదుటబడింది – "దీనికేనా ఇంత రాద్ధాంతం చేసి నన్ను హడలకొట్టేశారు?! ఆపరేషన్ చెయ్యడానికి ఆస్పత్రులు లక్షలు గుంజినా, మూత్రపిండాన్ని రెండు వేలకి అమ్ముకొనే జనాలు దేశంలో కొల్లలు. వాళ్లని వెతికిపట్టుకొనే దళారులు కొల్లలు. నిశ్చింతగా వెళ్ళి ఆపరేషన్ చేయించుకోండి," అన్నాను ధైర్యం చెబుతూ.

"నా ప్రాణాల్ని రక్షించుకోవడం కోసం మరొకరి జీవితంతో ఆడుకునే హక్కు నాకు లేదు. అందుకనే ఆపరేషన్ మాట డాక్టర్లు నా చెవిలో పడేసినా, మెదడులో చోటు చేసుకోకుండా జాగ్రత్త పడ్డాను. అలాగని జీవితాంతమూ డయాలసిస్ మీద ఆధారపడి జీవచ్ఛవంలా బ్రతకడమూ ఇష్టలేదు. అందుకనే ఆత్మహత్య చేసుకొందామనుకొన్నాను. కాని నా చేతుల్తో నా ప్రాణాలు

తీసుకోలేకపోతున్నాను."

అయన్నేమనాలో తెలియలేదు కాని, నేనవలసిన మాటల్ని అన్నాను.

"బలవంతం చేసి మరో వ్యక్తిచేత ప్రాణాలు తీయించుకొని మీరీ భౌతిక ప్రపంచం నుంచి ముక్తి పొందాలని చూస్తున్నారు. చట్టం విధించే శిక్ష నుంచి తప్పించుకొన్నా, ప్రాణాలు తీసిన ఆ వ్యక్తి జీవితాంతమూ మనోక్లేదంతో జీవచ్ఛవం కంటె అధ్వాన్నమైన పరిస్థితిలో బ్రతకాలి! ఇదికూడా మరోవ్యక్తి జీవితంతో ఆడుకోవడమే కదా?"

"మొదట్లో మీరు చెప్పినట్టుగా అసంబద్ధతల్ని సమన్వయం చేసి చూస్తే ఇంకొకరి మూత్రపిండం ధనమిచ్చి తీసుకొని ఆ వ్యక్తి జీవితంతో ఆడుకోవటంలోనూ, మరోకరికి ధనమిచ్చి ప్రాణాలు తీయించుకొని ఆ వ్యక్తికి మనోవేదన కలిగించడంలోనూ చాలా అంతరముంది. అందుకనే నేనెన్నుకున్న మార్గంలో నాకు తప్పు కనిపించలేదు. మూత్రపిండమే కావాలనుకొంటే నా కొడుకుల్లేరూ?" – లక్ష్మీపతిగారు చాలా సులువుగా అన్నారు.

అంత సులువుగానూ నేనూ అన్నాను.

"ఏదో మీ దయవల్ల పెద్దాడు ఉద్యోగం చేస్తున్నాడు. మిగిలిన ఇద్దరి కొడుకుల చదువులూ కొనసాగిపోతున్నాయి. నేను ఒక మూత్రపిండంతో బ్రతికినా, రెండింటితో బ్రతికినా ఎవర్నీ ఉద్ధరించలేను. మీరు బ్రతికి ఉంటే చాలు పదిమందికి బ్రతుకుతెరువు చూపించగలరు. మీ దేహతత్వానికి సరిపడుతుందని వైద్యులు కనక నిర్ధారణ చేస్తే మూత్రపిండాల్నే కాదు, నా దేహాన్నే మహదానందంగా అర్పించుకొంటాను. నా అదృష్టం బావుంటే ఈ విధంగానైనా మీ ఋణం తీర్చుకో కలుగుతాను."

లక్ష్మీపతిగారి కళ్ళలో చిన్న మెరుపు. అయితే ఆ మెరుపు నా రక్తనాళాల్ని చిట్లిస్తుందని ఊహించలేకపోయాను.

"వైద్య పరీక్షల ఫలితం సుముఖంగానే ఉండొచ్చు, ఎందుకంటే... ఎందుకంటే మీలోనూ నా తండ్రిగారి రక్తం ప్రవహిస్తోంది!"

ఆయన మాటలు విని ఒక్క ఉదుట్లో సోఫాలోంచి లేచాను."..

"మా తండ్రిగారు మీ తల్లిని కామించారు! దానికి ఆమె భర్త ప్రోద్బలం కూడా వుంది!"

నభోంతరాళాలు బ్రద్దలైనట్లనిపించింది. నాలో ఆవేశం తెంచుకొని వరద గోదావరిలా ప్రవహించింది. వంగి, బల్ల మీద నున్న రివాల్వర్ తీసుకొని లక్ష్మీపతిగారి గుండెలకి గురిపెట్టాను. ఆయన కళ్లు నా కళ్లలోకి చూస్తున్నాయి. 'ఊ కానివ్వండి' అని అహ్వానిస్తున్నాయి. కవ్విస్తున్నాయి. అర్థిస్తున్నాయి. సందిగ్ధంలో పడ్డాను. ఆయన చెబుతున్నది నిజమా? వాళ్ల కుటుంబం మా కుటుంబానికి చేసిన సహాయం వెనుక పరమార్థమా ఇది. లేక నన్ను రెచ్చగొట్టి తన కార్యం నెరవేర్చుకొందామన్న పన్నాగమా ఇది?

చేతిలో ఉన్న రివాల్వర్‌ని నేల మీదకు జారవిడిచి, ఆయనకేసి ఒక చెప్పలేని ఏహ్యభావంతో చూస్తూ, మౌనంగా ఆ హాలు నుంచి బయటపడి యింటిదారి పట్టాను.

ఆ రాత్రి పదిన్నరకి, 'రఘుపతిగారు మిమ్మల్నీ, మీ అబ్బాయినీ ఉన్నపళంగా

తీసుకురమ్మన్నా'రన్న వాళ్ళ డ్రైవరు తీసుకొచ్చిన కారులో వెంటనే బయలుదేరాం. లక్ష్మీపతిగారి భవనం ఆవరణలో పోలీసు జీపు ఆగివుంది. మేము కారు దిగడం చూస్తూనే లక్ష్మీపతిగారబ్బాయి రఘుపతి పరుగెత్తుకొంటూవచ్చి, చేతులు పట్టుకొని, పెల్లుబికి వచ్చే దుఃఖాన్ని ఆపుకొంటూ అన్నాడు.

"అంకుల్! నాన్నగారు ఇందాక మా అందరితోనూ డైనింగ్ టేబుల్ మీద డిన్నర్ చేస్తున్న సమయంలో ఉన్నట్టుండి తను కప్పుకున్న శాలువా మాటున దాచిన రివాల్వర్ పైకి తీసి, ఏం జరుగుతుందో ఊహించేలోపుగానే కణతలకి గురిపెట్టి కాల్చుకొని ఆత్మహత్య చేసుకొన్నారు! మీరిద్దరూ నా ప్రక్కన ఉంటే కొండంత ధైర్యంగా వుంటుంది,"

"ఈ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కొంతసేపు నేనూ, మీ నాన్నగారూ కబుర్లు చెప్పుకొన్నాం. కిడ్నీలు పాడైపోయాయని చెబ్తే, దిగులు పడవద్దని ధైర్యం చెప్పాను. కాని ఇలా ఆత్మహత్యకు పథకం వేసుకొంటారని ఏ మాత్రం ఊహించలేదు!" – సాయంత్రం లక్ష్మీపతిగారన్న మాటల్లో ఏ పాటి సత్యాసత్యాలున్నాయో నాకు తెలియదుకాని, నేను రఘుపతితో అన్న మాటల్లో కొంత నిజముంది. కొంత అబద్ధముంది. పూర్తిగా నిజం చెప్పే సాహసం చెయ్యలేకపోయాను.

"నాన్నగారు తమ కిడ్నీలు పాడైపోయాయని మీకు చెప్పారా?! అది నిజం కాదు. మీకు అసలు సంగతి తెలుసో లేదో తెలియదు కాని, నాన్నగారు విలాస పురుషులు. ఆ విలాస జీవితమే హైటెక్ రోగం ఎయిడ్స్‌కి దారి తీసింది!" అన్నాడు విచారంగా.

నేను నమ్మిన నిజం అబద్ధమని అప్పుడు తెలిసింది. నేను నమ్మీనమ్మని అబద్ధం నిజంగా అబద్ధమేనని రెండు రోజుల తర్వాత, కీర్తిశేషులు లక్ష్మీపతిగారు తాము బ్రతికున్న చివరి సాయంత్రం వ్రాసి పోస్టుచేసిన ఉత్తరం అందుకొన్న తర్వాత తెలిసింది.

"... గారికి,

చివరి ప్రయత్నంగా మాటల్లో ఓ అవకాశం దొరకడంతో నాకూ తల్లిదండ్రులతో సమానమైన మీ తల్లిదండ్రులకి కళంకాన్ని అపాదించి, మిమ్మల్ని రెచ్చగొట్టి, నే తలచిన యజ్ఞాన్ని పూర్తిగావిద్దామను కొన్నందుకు క్షంతవ్యుణ్ణి. అయితే మీరు వెడ్తూ వెడ్తూ చూసిన చూపు నన్ను నిలువునా దహించసాగింది. ఈపాటికి నా రోగమేదో మీకు తెలిసే వుంటుంది. ఆ భయంకరమైన రోగాన్ని జీవితాంతమూ భరించే సహనశక్తీ, నా కుటుంబంలోనే నన్ను నేను వెలివేసుకొనే శక్తీ, కర్మ సిద్ధాంతాన్ని నమ్మి తెచ్చుకొనేవాణ్ణేమో నాకు తెలియదుకాని, మళ్లీ మీ కళ్లలోకి చూసి మాట్లాడే ధైర్యం నాకీ జన్మలో కలగదని ఎప్పుడైతే నమ్మానో, అదే నా ప్రాణాల్ని ఒంటరిగా తీసుకోకపోయినా నలుగురి మధ్యా తీసుకొనే ధైర్యాన్నిచ్చింది. ఆ భావన నాలో కలిగించినందుకు మీకు కృతజ్ఞతలు.

లక్ష్మీపతి"

లక్ష్మీపతిగారు నేనా క్షణంలో భావోద్రేకంతో అసంకల్పితంగా చూసిన ఏహ్యాభరితమైన చూపుల్లోంచి, తాము ధైర్యంగా ఆత్మహత్య చేసుకొనేందుకు ఓ నమ్మకాన్ని సృష్టించుకొన్నారు. ఆ భావనకి కారణభూతుడైన నేను, కాదుకాదంటూనే ఆయనకి మరణభిక్ష పెట్టినట్లయింది! నన్ను కర్తగా చేసిన ఆ భగవంతుడే నన్ను క్షమించాలి!